# విలువలు

రాజ్యలక్ష్మిస్టాఫ్ రూమ్‌లో అడుగు పెట్టేసరికి హెచ్.ఎమ్. గారు అర్జంటుగా రమ్మంటున్నారని కబురొచ్చింది.

"హెచ్.ఎమ్.గారు తన్నెందుకు అంత అర్జంటుగా పిలుస్తున్నారు చెప్మా!" అని ఆశ్చర్యపోతూ హెచ్.ఎమ్. రూమ్‌కి వెళ్లింది.

రాజ్యలక్ష్మి గర్ల్స్ హైస్కూల్లో సైన్స్ అసిస్టెంటుగా చేరి రెండు నెల్లే అయింది. స్టాఫ్ ఎవరితోనూ యింకా అంతగా పరిచయం కాలేదు. గత రెండు నెలల్లోనూ హెచ్.ఎమ్.గారితో కూడా రెండుమూడు మార్లే మాట్లాడింది.

"రండి రాజ్యలక్ష్మిగారు! కూర్చోండి. నిన్న సాయంత్రం మీఇంటికి వచ్చేను. మీరు బజారుకు వెళ్ళారిని తెల్సింది. రేపు నాబర్త్‌డే కమ్ మేరేజ్‌డే! ఫ్రెండ్స్‌కి చిన్న పార్టీ యిద్దామనుకుంటున్నా. రేపు యీవినింగ్ మీరు తప్పకుండా రావాలి" అంటూ ఇన్విటేషన్ కార్డు అందించేరు.

"థ్యాంక్స్! తప్పకుండా వస్తాను." అంటూ ఇన్విటేషన్ కార్డు తీసుకొని బయటకు వచ్చింది రాజ్యలక్ష్మి.

"ఈవిడకు నావయస్సు కూతుర్లూ, కోడళ్లూ వున్నారని విన్నాను. ఇంకా ఈ వయస్సులో బర్త్‌డేలు, మేరేజ్‌డేలూ ఏమిటి చాదస్తం "అనుకొని అదే విషయం కో-టీచర్ లావణ్యాగారితో అంది.

"ఆ!ఏంవుంది ప్రజంటేషన్స్ దండుకోడానికి!" అంది లావణ్య కోపంతో.

"పోనీ మనమంతా వెళ్ళడం మానేస్తే?" అంది రాజ్యలక్ష్మి అమాయకంగా.

"ఇంకేమైనా వుందా ! చేతులారా మన ఉద్యోగాలకు మనమే రాజీనామా యిచ్చినట్లు

అవుతుంది. " అంది లావణ్య పేలవంగా నవ్వి.

రాజ్యలక్ష్మి చిన్ననాటి నుంచీ కాస్త రిజర్వ్‌డ్ టైప్. అందరిలా కలుపుకోలు మనిషికాదు. ఎంతసేపూ పుస్తకాలు పట్టుకుని కూర్చుంటుంది.

కుటుంబపరిస్థితులు. ఆర్థిక యిబ్బంది వల్ల బి.యిడి. అవగానే ఉద్యోగంలో జాయిన్ అయింది.

"ఈడొచ్చిన ఆడపిల్లవు! పైవూర్లో ఒంటరిగా ఎలా వుంటావు?" అని కన్నతల్లి తల్లడిల్లినా "నాకేం పర్వాలేదం"టూ వచ్చి స్కూలుకి దగ్గర్లో చిన్న గది అద్దెకు తీసుకొని వండుకొని తింటూ సాధ్యమైనంత పొదుపుగా గడుపుకొస్తూంది రాజ్యలక్ష్మి.

ఇంటి ఓనర్స్ కూడా చాలా మంచివారు. యింటావిడ సుశీలమ్మగారు రాజ్యలక్ష్మిని కన్నకూతురిలా చూసుకుంటున్నారు. రెండుపూటలా ఏవో వంటకాలు రాజ్యలక్ష్మి ఎంత వారిస్తున్నా వినకుండా యిస్తున్నారు.

"హెచ్.ఎమ్.గారికి ప్రజంటేషన్ ఏమివ్వాలి"

"కనీసం నలభై, ఏభై రూపాయల విలువగల వస్తువైతేనే గాని బావుండదు."

నెలాఖరు అవడం వల్ల రాజ్యలక్ష్మి చేతిలో నయాపైసాకూడా లేదు. చిల్లర ఖర్చుల కోసం వుంచిన పాతికరూపాయలు చెల్లెలు స్కూలు ఫీజు కట్టాలంటే ఆరోజే యింటికి మనియార్డరు చేసింది. ఏం చెయ్యాలో అర్థంకాక దిగులుపడి కూర్చుంది.

"ఏం అమ్మడూ! యింకా వంట ప్రయత్నం చెయ్యనట్టుంది?" అంటూ సుశీలమ్మగారు వచ్చేరు.

కంజీవరంపట్టుచీర, కాళ్లకు పారాణి, మెడక్రింద గంధం, ఇంటావిడ వేపు ఓ పార్యాయం చూసి

"రండి పిన్నిగారూ! కూర్చోండి. ఎక్కడికో పేరంటానికి వెళ్ళి వస్తున్నట్లున్నారు"అంది రాజ్యలక్ష్మి నవ్వుతూ.

"మన ప్రక్క వీధిలో ఇంజనీరుగారు లేరూ? వాళ్ళ మనవరాల్ని తొట్టిలో వేసేరు."

"అయితే పేరంటానికి మీరేం తీసుకెళ్ళారు?" అంది కుతూహలంగా.

"మీబాబాయిగారు రెడీమేడ్ షాపులో చిన్నగౌనుకొని తెచ్చేరు. అదే పదిహేను రూపాయలైంది" అన్నారు గర్వంగా.

"మనం అంతేసి ఖరీదుగల ప్రజంటేషన్స్ తీసుకెళితే పిడికెడు శనగలు మన మొహాన

కొడతారు" అంది రాజ్యలక్ష్మి నవ్వుతూ.

"అలా మనం ఎప్పుడూ తైఫారు వేసి చూడకూడదమ్మాయి! ఈ పేరంటం అన్నది మన మహిళాలోకానికి ఎంతో ఉపయోగకారి. మొగాళ్లు వీధిలోకెళ్లి ఏదో పనిమీద నలుగుర్ని కల్సుకొని స్నేహం పెంపొందించుకుంటారు. మనకా అవకాశం తక్కువ. అందువల్లే మన పూర్వీకులు స్త్రీల కోసం ఈ పేరంటం ఏర్పరిచారు. పేరంటంలో మన నలుగురు ఆడవాళ్లం ఒకదగ్గర కల్సుకొని క్రొత్తవారితో పరిచయం ఏర్పరుచుకోవటం, పరిచయస్తులతో స్నేహం పెంపొందించుకోవడం, సరదాగా కాస్సేపు కాలక్షేపం చెయ్యడానికి ఎంతో అనుకూలంగా వుంటుంది. ఈ అవకాశాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలి. కాని ఇచ్చి పుచ్చుకోవడంలో ఏం వుంది" అంటూ చిన్న ఉపన్యాసం యిచ్చేరు.

ఆవిడలోగల విజ్ఞతకు ఎంతో ఆశ్చర్యపోయింది రాజ్యలక్ష్మి.

"మీబాబాయిగారు బజారుకి వెళ్ళాలన్నారు మళ్లీ వస్తాను" అంటూ వెళ్ళిపోయారు.

రాజ్యలక్ష్మి తను మొదటి నెలజీతం అందుకొని ఉగాది కోసం కొని దాచుకున్న వాయిల్‌చీర రంగు కాగితంలో నీట్‌గా పేక్‌చేసి హెచ్.ఎమ్.గారికి ప్రజంట్ చేసింది బర్త్‌డే కమ్ మేరేజ్‌డే కానుకగా.

మర్నాడు సాయంత్రం ఇంటావిడ పాత బట్టలకు స్టీలు సామాను యిచ్చే ఆమెతో ఏదో బేరం చేస్తుంటే రాజ్యలక్ష్మి కుతూహలంగా చూడ్డానికి వెళ్లింది.

స్టీలుసామాన్ల గంపలో తను ముందురోజు హెచ్.ఎమ్. గారికి ప్రజంటేషన్ ఇచ్చిన వాయిల్‌చీర చూసి ఆశ్చర్యపోయి అడిగింది.

"అవునమ్మగోరూ ఏటా కొత్తసీరలేసి స్టీలు సామాన్లు కొంటారు ఆమేస్టరమ్మగోరు. ఈ పొద్దు యీ మూడు కొత్తసీరలు ఏసి స్టీలు కేరియరు తీసుకొన్నారు. అంతా పాత బట్టలే ఏస్తారు.కాని ఆ మేస్టరమ్మగోరు ఏటా కొత్తబట్టలే ఏసి కొంటారు." అన్న మాటలకు నిర్ఘాంతపోయింది రాజ్యలక్ష్మి.

**(ఆంధ్రజ్యోతి వారపత్రిక, 25-4-1980)** ✪